క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన సునీల్



తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కారుమూరి సునీల్ కుమార్

ఏలూరు టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్ తాడేపల్లిలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ



33వ డివిజన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్) : స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా స్థానిక 33వ డివిజన్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మలేరియా సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని చిట్టివలస పాకలు, రైల్వే ట్రాక్ రోడ్డు, ఉషా పిక్చర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీ స్థలాలలో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.సుధారాణి, సురేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.అప్పారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

గుడివాకలంకలో ఉప సర్పంచ్ అభ్యర్థిని ఎన్నిక

ఏలూరు రూరల్: గుడివాకలంక పంచాయతీ ఉపసర్పంచ్ అభ్యర్థిని గురువారం ఎన్నుకున్నారు. 6వ వార్డు సభ్యురాలు నేపాల కాత్యాయని ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. కొద్దిరోజుల క్రితం తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గ్రామ సర్పంచ్ జయమంగళ ప్రభావతి, ఉపసర్పంచ్ రుక్మనంధమహరాజ్ తమ పదవులకు రాజీనామా చేశారు. ఉపసర్పంచ్ స్థానంలో గ్రామ టీడీపీ నాయకుడు నేపాల జగతిబాబు భార్యను ఇప్పుడు ఎన్నుకున్నారు. త్వరలో అధికారులు నిర్వహించే అధికారిక ఎన్నికలో కాత్యాయనిని గెలిపించాలని ఇతర వార్డు సభ్యులకు సూచించారు.

దోమల నివారణతోనే డెంగీ దూరం



చొదిమెళ్లలో తొట్టిలో నీటి నిల్వపై అవగాహన కల్పిస్తున్న ఏడీ బి.లక్ష్మీ నరసింహకుమార్

ఏలూరు టౌన్ : వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయనీ వైద్య సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేస్తూ వ్యాధుల నివారణకు కృషి చేయాలని జోన్-2 మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ బీ.లక్ష్మీ నరసింహకుమార్ సూచించారు. నగరంలోని గవరవరం, చొదిమెళ్ళ, తదితర డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. స్థానికంగా పరిస్థితులను ఆయన పరిశీలించి, అక్కడి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. డెంగీ ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని, జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని వైద్యుల వద్దకు వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు విపరీతంగా వ్యాప్తి చెందుతాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, ఇంట్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చైతన్యవంతులను చేయాలని కోరారు. టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్ళు, పూలకుండీల్లో నీటి నిల్వ లేకుండా వారంలో ఒకసారి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. డెంగీ దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లోనే పెరుగుతుందనీ, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, అశ్రద్ధ చేయటం ద్వారా దోమకాటుకు గురైతే డెంగీ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, జోనల్ టీం సభ్యులు రవిశేఖర్, సతీష్, నిరంజన్, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, కిరణ్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, రమేష్‌బాబు, జోషి, ఆరోగ్య కార్యకర్తలు దుర్గ, శ్యామల, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే అచ్యుతాపురంలో ప్రమాదం



ఏలూరులో ధర్నా చేస్తున్న ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్) : అనకాపల్లి అచ్యుతాపురం సెజ్‌లో రసాయన ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై నిరసన తెలుపుతూ స్థానిక వన్‌టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నగర జాయింట్ సెక్రెటరీ మంగం అప్పారావు మాట్లాడారు. ఈ ఘటనపై ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు సరైన తనిఖీలు చేయకపోవడం, యజమానుల లాభాపేక్ష, ప్రభుత్వ వైఫల్యం ప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 18 మంది కార్మికులు చనిపోయారని, ఇంకా మృతుల సంఖ్య పెరిగే పరిస్థితి ఉందన్నారు. సుమారు 200 మంది కార్మికులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని, మృతులకు ఫార్మా యాజమాన్యం నుంచి రూ.కోటి బాధిత కుటుంబాలకు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని, యాజమాన్యాన్ని తక్షణం అరెస్టు చేసి తగు విధంగా శిక్షించాలని కోరారు. ముఖ్యంగా జిల్లా ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, రంగాల నూకరాజు, రంగాల అప్పారావు, రమణమూర్తి, పెద్ది శెట్టి గంగరాజు, పెంకు అప్పారావు, సాయిబాబా, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కువైట్ నుంచి క్షేమంగా స్వదేశానికి



కలెక్టర్ వెట్రిసెల్వికి, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సంకురమ్మ

ఏలూరు (మెట్రో): బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ అవస్థలు పడుతున్న ఓ మహిళ జిల్లా అధికారులు, నాయకుల చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. వివరాలిలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన తాటి సుంకరమ్మ ఉపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లింది. అయితే అక్కడ యజమానులు పెట్టే వేధింపులు తాళలేక తన బాధలను తెలుపుతూ సెల్ఫీ వీడియో తీసి జిల్లాకు చెందిన నాయకులకు పంపించింది. దీనిపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌లు జిల్లా అధికారులకు రాతపూర్వకంగా సమాచారాన్ని అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి తాటి సుంకరమ్మను స్వదేశానికి రప్పించేందుకు డీఆర్వో పుష్పమణికి, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డీఆర్వో పుష్పమణి కువైట్ ఎంబసీ అధికారులతో, అదే విధంగా భారత్ ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరిపి సంకురమ్మను క్షేమంగా స్వదేశానికి రప్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను సుంకరమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంకురమ్మ సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు కృషి చేసిన డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు చర్యలు తీసుకున్న అధికారులు, నాయకులకు ఈ సందర్భంగా సంకురమ్మ కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా సంకురమ్మ కోరిక మేరకు రేషన్‌కార్డు, ఉండేందుకు గృహనిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి భరోసా ఇచ్చారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



ఎస్పీ ప్రతాప శివకిషోర్‌ను కలిసిన పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలవరం పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రజల శాంతిభద్రతల పరిరక్షణతోపాటు, ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ చెప్పారు. పోలవరం సబ్‌డివిజన్ పోలీస్ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందజేశారు. ఏలూరు ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేసిన వెంకటేశ్వరరావు సాధారణ బదిలీల్లో భాగంగా పోలవరం డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి



ఏలూరు మార్కెట్ యార్డ్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న మహిళలు

ఏలూరు రూరల్: పశ్చిమబెంగాల్‌లో ట్రెనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక డిమాండ్ చేశారు. గురువారం ఏలూరు మార్కెట్‌యార్డ్ వద్ద ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన మహిళలు, కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని చట్టాలు చేసినప్పటికీ మహిళలపై అత్యాచారం, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన త్రిసభ్య ధర్మాసనం దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో అశ్లీలత వీడియోల వల్ల దేశంలో యువత పెడదారి పడుతోందన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచార, దాడుల మూలాల నిర్మూలనకు జస్టిస్ వర్మ కమిషన్ సిపార్సులను ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. అనంతరం కలకత్తాలో అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ యార్డ్‌లో మహిళ కూలీలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేవీ రత్నం, సింహాచలం, రాములమ్మ, పద్మ, రూప, కుమారి, గంగమ్మ, సరోజని, పూర్ణమ్మ, కేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

'ప్రదర్శిని' బిజినెస్ కార్నివాల్ ప్రారంభం



కళాశాలలో విద్యార్థినులు ఏర్పాటు చేసిన స్టాల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే వ్యాపార విధానాలు, వ్యవస్థాపక మెలకువలను విద్యార్థులు తెలుసుకోవాలని, ఆయా మెళకువలను నేర్పించడానికి ప్రదర్శిని 2024 కార్యక్రమం ఏర్పాటు చేశామని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ చెప్పారు. సెయింట్ థెరెసా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాలలో ఎంబీఏ, బీబీఏ విద్యార్థినులు సంయుక్తంగా నిర్వహించిన 'ప్రదర్శిని 2024' బిజినెస్ కార్నివాల్‌ని ప్రిన్సిపాల్ మెర్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెటింగ్ అనేది నిర్వహణ, వాణిజ్యాల ప్రాథమిక భాగాలలో ఒకటని, ఇది ఒక ఉత్పత్తి లేదా సేవను కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలను సూచిస్తుందన్నారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థినులు తమ వ్యాపార చాతుర్యాన్ని, నాయకత్వ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాయన్నారు. ఎంబీఏ విభాగాధిపతి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని, వ్యాపార అనుభవాల్లో మెలకువలను ప్రయోగాత్మకంగా తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బీబీఏ అధ్యాపకురాలు హెప్సిబా మాట్లాడుతూ విద్యార్థినులు వ్యాపార మెలకువలలో భాగంగా సందర్శకులను ఆకర్షించడానికి వివిధ రకాల ప్రచార వ్యూహాలను ఉపయోగించారన్నారు. ఈ ప్రదర్శనలో ఆటలు, దుస్తులు, వివిధ రకాల ఉపకరణాలతో సందర్శకులను ఆకర్షించారు. విద్యార్థిని జ్ఞానిజైన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా తమకు వ్యాపార స్ఫూర్తి, అనుభవంతో పాటు సమస్యల పరిష్కార మార్గాలు కూడా అనుభవంలోకి వచ్చాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియా క్రిస్టియా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	32	కీరా దోస	48
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100-160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	45	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

డిగ్రీ అడ్మిషన్లకు 24 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫేజ్-1లో రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ఈనెల 24వ తేదీ లోగా కళాశాలలో రిజిస్టర్ చేయించుకోవచ్చని, అలానే తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను అందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరగోరు విద్యార్థులు ఫేజ్-2లో వెబ్‌ఆప్షన్స్ పెట్టుకోవడానికి తమ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

నూరుశాతం ఫలితాలు

గురువారం విడుదల అయిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలలో తమ కాలేజీ విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. హిస్టరీ (1-2), ఎకనామిక్స్ (1-2), పొలిటికల్ సైన్స్ (1-2), బోటనీ (1), జువాలజీ (1) కాస్ట్ అండ్ మేనేజిమెంట్ అకౌంటింగ్, ఆడిటింగ్, డేటా బేస్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ ఎస్ఏఓకు చార్జిషీట్ జారీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌లో సీనియర్ అక్కౌంట్స్ అధికారిగా పని చేస్తున్న కే సత్యకిషోర్‌కు ఆ సంస్థ సీఎండీ పృధ్వీతేజ ఇమ్మడి చార్జిషీట్ జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పెన్షన్ కేసులను క్లియర్ చేయాలని సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉద్దేశ పూర్వకంగా సూచనలు ధిక్కరించారని చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 15 రోజుల్లోగా సంతృప్తికరమైన సమాధానం అందకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొల్లేరు విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత



అవార్డులు అందుకున్న కొల్లేరు ప్రాంత విద్యార్థులతో జేసీ పి.ధాత్రిరెడ్డి తదితరులు

ఏలూరు (టూటౌన్): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపిన కొల్లేరు గ్రామాల విద్యార్థులకు జేసీ పి.ధాత్రి రెడ్డి గురువారం నగదు బహుమతులను అందజేశారు. కొల్లేరు నాయకుడు సైదు గంగరాజు 101వ జయంతి సందర్భంగా కొల్లేరు నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా యాదవ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేసీ పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్న సైదు గంగరాజు కుటుంబ సభ్యులు, ఘంటసాల వెంకటలక్ష్మిని జేసీ అభినందించారు. కొల్లేరు ప్రజల వేదిక కన్వీనర్ చింతపల్లి వెంకటనారాయణ, పైడిచింతపాడు సర్పంచ్ ముంగర వెంకటేశ్వరరావు, శృంగవరప్పాడు మాజీ సర్పంచ్ ఘంటసాల రామాంజనేయులు, సైదు మృత్యుంజయరావు, సైదు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సిగ్నల్స్ ఏర్పాటు చేయండి సారూ..



గుండుగొలను హైవే రోడ్డుపై డివైడర్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయని దృశ్యం



సోమవరప్పాడు డివైడర్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయని దృశ్యం

దెందులూరు: జాతీయ రహదారిపై డివైడర్ల వద్ద ఎన్‌హెచ్ఏ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సిగ్నల్స్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై విజయవాడ-వైజాగ్ రోడ్డు, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డుపై నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గుండుగొలను, సోమవరప్పాడు వద్ద వాహనచోదకులకు స్పష్టంగా మార్గం తెలిసేలా డివైడర్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడగా మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గుండేరు వాగుకు గండి

దెందులూరు: గుండేరువాగు ఉధృతి పెరగడంతో దెందులూరు సైఫన్ వద్ద గండికొట్టారు. గతంలో దెందులూరు- అలుగులగూడెం మార్గంలో గుండేరు వాగు ఉధృతికి ఒక మహిళ మృతి చెందగా, మరో చిన్నారి కొట్టుకుపోయిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ గండి కొట్టారు. దీంతో వాగు నీరు సీతంపేట కాల్వ ద్వారా దిగువ ప్రాంతానికి ప్రవాహం మళ్లడంతో సైఫన్ వద్ద రాకపోకలకు ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. భవిష్యత్తులో సైఫన్ వద్ద కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిమ్మలో గడ్డి తెగులు.. ఆందోళనలో రైతులు



పెదవేగిలో గడ్డి తెగులు ఆశించిన నిమ్మ చెట్లు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలోని నిమ్మ తోటల్లో గడ్డి తెగులు ఆశించడంతో నిమ్మ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదవేగి, దెందులూరు మండలాల్లో 1582 ఎకరాల్లో నిమ్మ సాగు జరుగుతోంది. కనివిని ఎరుగని రీతిలో గడ్డి తెగులు ఆశించి చెట్లు పూర్తిగా ఎండిపోవడం, కాసిన కాయ నేలబారిన పడిపోవడం, కొన్ని చెట్లల్లో అసలు కాయలు కాయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. అంతర పంటల్లో అద్భుతాలు సృష్టించి ఇతర జిల్లాల రైతాంగానికి ఆదర్శంగా నిలిచిన ఈ ప్రాంత రైతులు నిమ్మసాగులో ఎదురైన ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేలా చర్యలు తీసుకుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఇంతటి స్థాయిలో నిమ్మ చెట్లు గడ్డి తెగులుతో పూర్తిగా పాడవుతుంటే హార్టికల్చర్ అధికారులు కనీసం పొలాలకు వచ్చి చూసింది లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. హార్టికల్చర్ అధికారులు, పెదవేగి, దెందులూరు మండలాల్లో నిమ్మ తోటలను పరిశీలించి రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నారు. కాగా ఈ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హార్టికల్చర్ అసిస్టెంట్ వివరించారు. గడ్డితెగులు నివారణకు బావిస్టీన్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 3-4 రోజులు పాటు రోజుకు నాలుగుసార్లు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఎస్ఈపీ టీఏసీఎల్ఐఎల్ఈ ఒక మిల్లీమీటరు ఒక లీటరు నీటిలో కలిపిన మిశ్రమాన్ని రోజుకు రెండుసార్లు 3-4 రోజులు పిచికారీ చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలను హార్టికల్చర్ ఉద్యోగులను సంప్రదించాలని, హార్టికల్చర్ సలహాలు, సూచనలు పాటిస్తూ గడ్డి తెగులు నివారణకు కృషి చేయాలన్నారు.